క్లుప్తంగా

సీతారామ క్షేత్రంలో పూజలు



విశేష అలంకరణలో సీతారాములు

మండపేట: పట్టణంలోని బురుగుంట చెరువు సమీపాన ఉన్న సీతారామ క్షేత్రంలో శనివారం వధూవర పూజలు నిర్వహించారు. ధనుర్మాసంలో కూడారై సందర్భంగా ఆలయ అర్చకుడు వరదాచార్యుల ఆధ్వర్యంలో సీతారాములకు వధూవర పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మల్లిపూడి కొండయ్య, మల్లిపూడి గనేశ్వరరావు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పోస్టుమాస్టర్ నాగేశ్వరరావు సేవలు మరువలేం



నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తపాలా ఉద్యోగులు

మండపేట: పోస్టల్ ఉద్యోగుల సమస్యలపై అలుపెరుగని పోరాటం సాగించిన పోస్టు మాస్టర్ డి.శివనాగేశ్వరరావు సేవలు మరువలేనివని రామచంద్రపురం బ్రాంచ్ తపాలా ఉద్యోగుల మాజీ కార్యదర్శి కేవీ నారాయణరావు (బాబి) అన్నారు. తపాలా శాఖలో సుదీర్ఘకాలం పాటు పోస్టు మాస్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన శివ నాగేశ్వరరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా శనివారం మండపేట తపాలా కార్యాలయంలో ఆయన సంతాప సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పోస్టుమాస్టర్‌గా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఎండీ ఎం షరీఫ్, పి.వెంకట్రావు, ఎస్.దుర్గాదేవి, ఎం .అనూష, ఎం.మధుసూదనరావు, ప్రవీణ్, విశ్రాంత ఉద్యోగి పుట్టా అమ్మిరాజు తదితరులు పాల్గొన్నారు.

దర్శనం టిక్కెట్లను యాప్‌లో అందుబాటులో ఉంచాలి

మండపేట: దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనం టిక్కెట్లను యాప్ ద్వారా 24/7 ప్రజలకు అందుబాటులో ఉంచాలని కూర్మావెంకటరెడ్డినాయుడు సామాజిక అభివృద్ధి విషయాల అధ్యయన సంస్థ ఫౌండర్ చైర్మన్, న్యాయవాది టీవీ గోవిందరావు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కలియుగ దైవంగా పేరుగాంచిన వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు ప్రతిరోజూ లక్షలాదిగా తిరుమల కొండకు తరలి వెళ్తారన్నారు. ప్రపంచం డిజిటల్ వైపు పరుగులు తీస్తున్న తరుణంలో రైల్వే, ఆర్టీసీ టిక్కెట్ల మాదిరిగా టీటీడీ దర్శనం టిక్కెట్లను యాప్‌లో తీసుకునే విధంగా 24/7 అందుబాటులో ఉంచాలని గోవిందరావు విజ్ఞప్తి చేశారు.

నేడు ఉత్సవ్ రన్ ప్రారంభం

రామచంద్రపురం: సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఉత్సవ్ రన్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నేడు ఉదయం ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఆయన క్యాంపు కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంక్రాంతి ఉత్సవ్ 2ಃ25 సంబరాల ప్రారంభోత్సవంలో ఉదయం 8 గంటలకు ఉత్సవ్ రన్‌ను స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఉత్సవ్ రన్ ప్రారంభ సూచికగా వీఎస్ఎం కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని క్రీడాకారులు, యువతీ యువకులు, మహిళలు, పిల్లలు, కార్యకర్తలు, కూటమి నాయకులు, అధికారులు, ఉత్సవ్ రన్ లో ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పశుపోషణకు ప్రాధాన్యమివ్వాలి

కాజులూరు: పశుపోషణకు గ్రామాల్లో రైతులు ప్రాధాన్యమివ్వాలని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం అన్నారు. గొల్లపాలెంలో గోకులం పథకం ద్వారా ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.2.30 లక్షలతో నిర్మించిన మూడు పశువుల షెడ్లను శనివారం వాసంశెట్టి సత్యం ప్రారంభించారు. రైతులు గోకులాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల గ్రామాలకు చెందిన పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి

కపిలేశ్వరపురం: పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండలంలోని వెదురుమూడిలో రూ.29.10 లక్షలతో చేపట్టిన రెండు మినీ గోకులాలు, పలు రహదారులను డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్, నాయకులు పుత్సల శ్రీనివాస్, నానిబాబు, ముత్యాల వెంకట్రావులతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ రూ.2.02 కోట్లతో ఆరు గ్రామాల్లో రహదారులను నిర్మించామన్నారు. అంగర, కోరుమిల్లి, వాకతిప్ప, నాగులచెరువు, కేదారిలంక గ్రామాల్లో 1.70 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేశామన్నారు. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్టు ఆయన తెలిపారు.



ఫ్యాన్సీ వస్తువులతో అమ్మకాలకు బయలుదేరుతున్న కాలనీ మహిళలు



గంగిరెద్దుతో ప్రజలను అలరిస్తున్న గంగిరెద్దుల కుటుంబాలు



గంగిరెద్దుతో ఊరేగుతున్న కళాకారుడు

ఆదరణ కరవు..
ఆధునికత వైపు పరుగు

- గంగిరెద్దుల కళాకారులు కళాకారుల జీవితాల్లో సామాజిక మార్పు
- కళను పోషిస్తూనే కాలానుగుణ నడవడిక
- చిన్నపాటి వ్యాపారాల వైపు మళ్లుతున్న వైనం
- కోనసీమలో గంగిరెద్దుల కళకు తగ్గని ఆదరణ

కపిలేశ్వరపురం/రాయవరం: 'అమ్మగారికీ దండం పెట్టు, అయ్యగారికీ దండం పెట్టు' అంటూ ఏళ్ల తరబడి ఇంటింటికీ తిరుగుతూ నాలుగు డబ్బులు సంపాదించుకుంటూ గడిపిన జీవితాలు ఆధునికతవైపు మళ్లుతున్నాయి. ఒక పక్క కళను పోషిస్తూనే కాలానుగుణంగా వస్తున్న మార్పులను ఒడిసి పట్టుకుంటున్నారు. సంక్రాంతి మినహా మిగిలిన రోజుల్లో గంగిరెద్దుల కళకు ఆదరణ లేకపోవడం వారి జీవితాలను ఇతర మార్గాల వైపు మళ్లిస్తోంది. ప్రపంచీకరణ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో చోటుచేసుకున్న సామాజిక మార్పులకు గంగిరెద్దుల కళాకారులు మినహాయింపు కానేకానేకాదు. కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి గ్రామంలో అత్యధిక సంఖ్యలో ఉన్న గంగిరెద్దుల కళాకారుల జీవన స్థితిగతులపై ఈ కథనం...

గంగిరెద్దుల కళాకారుల జీవన నేపథ్యం ఇదీ..

మారిన రోజుల నేపథ్యంలో పరిమితంగా కనిపిస్తున్న గంగిరెద్దుల కళాకారులు వెదురుమూడిలో చెప్పుకోతగ్గట్టుగా ఉన్నారు. కొన్నేళ్ల క్రితం సంచార జీవనం సాగిస్తూ వెదురుమూడిలో స్థిరపడ్డారు. ఒకప్పుడు సుమారు 100 కుటుంబాల వారు గంగిరెద్దులను జిల్లా వ్యాప్తంగా ఊరేగిస్తూ జీవించేవారు. పెళ్లిళ్ల సమయంలో పెండ్లికుమారుడు, పెళ్లి కుమార్తెలు ధరించిన బాసికాలు, చీరలను గంగిరెద్దుల వారికి ఇవ్వడం పల్లెల్లో ఆచారంగా ఉండేది. ప్రస్తుతం ఈ ఆచారం కోనసీమలోని మల్కిపురం, రాజోలు, కొత్తపేట తదితర ప్రాంతాల్లో మాత్రమే కొనసాగుతుందని గంగిరెద్దుల కళాకారుడు గంగుల పెద్దబ్బు తెలిపారు. దీంతో పెళ్లిల సీజన్ పూర్తయిన తరువాత వీరు వెదురుమూడి నుంచి కాలినడకన ఎద్దుతో పాటు కోనసీమకు వెళ్లి నెల రోజులు ఇంటింటికీ తిరుగుతూ కళా ప్రదర్శనలు చేస్తూ బాసికాలను తీసుకుని వారిచ్చే డబ్బులతో తిరిగి వస్తుంటారు.

సాహసోపేతంగా గంగిరెద్దుల కళాపోషణ

గంగిరెద్దుల ప్రదర్శనలు బృందంగా చేయాల్సి ఉంటుంది. ఏడుగురి సాయంతో ఎద్దును గుండెలపై కాళ్లతో తొక్కించుకోవడం, చెక్కను అమర్చుకుని ఉదరంపై ఎద్దు నాలుగు కాళ్లతో నిలబెట్టుకోవడం, కుటుంబ సభ్యులను పొగుడుతూ ఎద్దుతో తల ఊపించడం వీరి విన్యాసాల్లో కొన్ని. ఇవన్నీ సాహసంతో కూడుకున్నవి. కళాకారులు కాలినడకన కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాలి. ఇతర ప్రాంతాలకు వెళ్లిన నెల రోజులకు గాని వీరు ఇళ్లకు చేరలేరు. పల్లెల్లో మారుతున్న సంస్కృతి, సంప్రదాయాల నేపథ్యంలో ఈ కళారూపాలు కాస్త కళా విహీనమయ్యాయి. అనేక మంది ఇతర వృత్తులకు వలసపోయారు. వృత్తిని వదలలేక ప్రస్తుతం కేవలం ఏడు కుటుంబాల వారు మాత్రమే గంగిరెద్దులను ఆడించే కళాకారులుగా కొనసాగుతున్నారు.

ఆదరణ తగ్గిన నేపథ్యంలో ఆధునికతవైపు..

గంగిరెద్దుల కళా ప్రదర్శన సాహసంతో పాటు ఖర్చుతో కూడుకున్నది. పాత రోజుల్లో ఎద్దు పోషణ పెద్ద సమస్యగా ఉండేదికాదు. ప్రస్తుత రోజుల్లో పచ్చగడ్డి కూడా కొనాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ఎద్దు అలంకరణ ఖర్చుతో కూడుకున్నది. ఏడాదిలో పన్నెండు నెలలూ ఎద్దును పెంచాలి కాని పనేమో సంక్రాంతిలోనే ఉంటుంది. ఎంత కష్టపడినా ఇంటింటికీ తిరగడమంటే యాచక పని అన్న ఆలోచన మదిలో మెదులుతుంది. దానికంటే పనిచేసుకున్నా మంచి డబ్బులు వస్తాయన్న ఆలోచన నూతన తరం వారిలో చొటుచేసుకుంది. యువకులంతా సైకిళ్లపై ఫ్యాన్సీ వస్తువులను అమర్చుకుని ఇంటింటికీ వెళ్లి అమ్మకాలు సాగిస్తున్నారు. తిరునాళ్లలో దుకాణాలు వేస్తూ మరికొంత మంది జీవిస్తున్నారు. అనేక మంది వ్యవసాయ, ఇతర పనులవైపునకు మళ్లుతున్నారు. కళాకారులు తమ పిల్లలను చదివించుకుంటున్నారు. కాలనీలో మొదటిసారిగా గంగుల శ్రీను బీఈడీ చదివాడు. తర్వాత అనేక మంది చదువుల బాట పట్టారు. ఇదే పరిస్థితి కొనసాగితే వారి జీవితాల్లో మరెన్నో అద్భుతాలు జరిగే అవకాశాలున్నాయి.

జిల్లాలో రెండు వేల కుటుంబాలు

జిల్లాలో సుమారుగా గంగిరెద్దుల కుటుంబాలు రెండు వేల వరకూ ఉన్నట్టు తెలిసింది. పసలపూడి, రాయవరం, తాళ్లపాలెం, ముక్కామల, రావులపాలెం, కండ్రిగరేవు, రాజోలు తదితర గ్రామాల్లో గంగిరెద్ల కుటుంబాలున్నాయి. ఈ వృత్తిలో ఆదరణ తగ్గిపోవడంతో ఇతర వత్తుల్లోకి మరలిపోతున్నారు. ముఖ్యంగా పలువురు ప్లాస్టిక్ సామన్లు విక్రయించుకునే పనిలో ఉన్నారు. కొందరు నేటికీ పక్కా ఇళ్లకు కూడా నోచుకోలేని పరిస్థితిలో ఉన్నారు. ఇప్పటికీ మార్కెట్ షెడ్లలో నివాసం ఉంటున్నారు. తల్లిదండ్రుల నుంచి అనాదిగా వృత్తిలో ఉన్న వారు మాత్రమే ఈ వృత్తిలో కొనసాగుతున్నారు. గంగిరెద్దుల ఆటకు ఆదరణ తగ్గుతుండడంతో ప్రస్తుత తరం ఈ వృత్తిని స్వీకరించేందుకు ముందుకు రావడం లేదు. కాగా గతం నుంచి వృత్తిలో ఉన్న వారు మాత్రమే ధనుర్మాసం ప్రారంభం కాగానే, గంగిరెద్దులను తీసుకుని సంక్రాంతికి జిల్లాలోని కందికుప్ప, అమలాపురం, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాలకు తరలివెళ్లారు.

కాలినడకన తిరుగుతున్నాం



గంగిరెద్దుల కళ అంతరించిపోవడంతో కుటుంబ పోషణకు ఫ్యాన్సీ వస్తువులను అమ్ముకుంటూ జీవిస్తున్నాం. దీనికోసం కాలినడకన ఊర్లు తిరుగుతున్నాం. సంక్రాంతికి గిరాకీ ఎక్కువ ఉంటోంది.
– బొమ్మిన మహాలక్ష్మి, వెదురుమూడి, కపిలేశ్వరపురం మండలం

పెట్టుబడి లేక ఇబ్బందులు



ఆదరణ తగ్గడంతో కళను వదిలి ఫ్యాన్సీ వస్తువుల అమ్ముకుంటూ జీవిస్తున్నాం. ఫ్యాన్సీ వస్తువుల కొనుగోలుకు తగిన పెట్టుబడి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కొద్దిపాటి సొమ్ముతోనే వస్తువులను కొని అమ్ముతున్నాం.
– గంగుల పద్మ, వెదురుమూడి, కపిలేశ్వరపురం మండలం

ఎద్దు పోషణ భారంగా మారింది



గతంలో ఎద్దుకు పచ్చ గడ్డిని రైతులు ఇచ్చేవారు. ప్రస్తుతం యంత్రాలతో పంటను కోయిస్తుండటంతో గడ్డి ఖరీదైన సరకుగా మారిపోయింది. దీంతో ఎద్దు పోషణ భారంగా మారింది.
– మీసాల చినబొండాం, వెదురుమూడి , కపిలేశ్వరపురం మండలం

కళను వదులుకోలేక ఎద్దును ఆడిస్తున్నాం



పెద్దల కాలం నుంచీ గంగిరెద్దుల కళ ఉంది. ఆ కళను వదులుకోలేక ఎద్దులను ఆడిస్తున్నాం. కోనసీమ ప్రాంతంలో తిరుగుతున్నాం. కుర్రాళ్లు మాత్రం సైకిళ్లపై వస్తువులు అమ్ముతున్నారు.
– గంగుల పెద్దబ్బు ,వెదురుమూడి , కపిలేశ్వరపురం మండలం

కులవృత్తిని వదులుకోవాలి



గతంలో మాదిరిగా గంగిరెద్దుల ప్రదర్శనకు ఆదరణ అంతగా ఉండడం లేదు. కులవృత్తిని వీడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ వృత్తికి ప్రభుత్వం గుర్తింపు తీసుకురావాలి. మాలో పలువురు గౌరవ ప్రదమైన జీవనం కోసం ప్రయత్నిస్తున్నారు. ఆ క్రమంలోనే చిరు వ్యాపారాల వైపు వెళ్తున్నారు.
– బొడ్డు రాజు, పసలపూడి, రాయవరం మండలం

కాలుదువ్వుతున్న పందెం రాయుళ్లు

కోడి పందాలకు ప్రారంభమైన యత్నాలు



దుగ్గుదుర్రులో కోడిపందాలు వద్దంటూ ప్రచారం నిర్వహిస్తున్న అధికారులు

కాజులూరు: సంక్రాంతికి ముందే కోడిపందాలకు పందెంరాయుళ్లు కాలు దువ్వుతున్నారు. సంక్రాంతి పండగ సందడి ప్రారంభమయిందంటే రామచంద్రపురం నియోజకవర్గంలోని గ్రామాల్లో కోడి పందాలు జోరుగా సాగుతుంటాయి. పందాలు నిర్వహించేందుకు వీల్లేదంటూ పోలీసులు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ఏటా పొలాల మధ్య దిమ్మలపై పందెగాళ్లు యథేచ్ఛగా కోడిపందాలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఈ ఏడాది ఉత్తర్వులు ఉన్నా రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో పండగల రోజుల్లో స్థానిక పోలీసులు చూసీచూడనట్టు ఉండటం ఖాయమని నిర్వాహకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది గ్రామాల్లో పందాలకు కోళ్లు కాస్త ముందుగానే కాలు దువ్వుతున్నాయి. కాజులూరు మండలం మంజేరు, దుగ్గుదుర్రుల్లో ఇటీవల కోడి పందాలు నిర్వహిస్తుండగా గొల్లపాలెం పోలీసులు దాడులు నిర్వహించి పలువురిని అరెస్టు చేశారు. అయినప్పటికీ గ్రామాలలో పందాలు ఆగడం లేదు. ఈ సారి నియోజకవర్గ పరిసర గ్రామాలకే పరిమితం కాకుండా ఈసారి జిల్లా వ్యాప్తంగా విస్తరింపజేసేందుకు నిర్వహకులు ఏర్పాట్లు చేసుకున్నట్టు సమాచారం. కోడి పందాలు నిర్వహించేందుకు అనువైన ప్రదేశాలు మండలంలో ఉండటంతో వాటిని ఉపయోగించుకుని జిల్లా స్థాయిలో సంక్రాంతి పందాలకు ప్రచారం కల్పించాలని నిర్వాహకుల ఆలోచనగా చెబుతున్నారు. స్థానికంగా జరిగే కోడిపందాల నిర్వహణను దృష్టిలో ఉంచుకుని మండల గ్రామాల్లో కొందరు కోళ్లఫారాలు మాదిరి పందెంపుంజుల పెంపకం చేపట్టారు. పుంజులకు ప్రత్యేక శిక్షణను ఇస్తూ వాటి జాతులను బట్టి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పండగ పేరుతో కోడి పందాలతో పాటు గుండాట, పేకాట తదితర జూదాలు నిర్వహిస్తున్నారని దీంతో రూ.కోట్లు అనధికార వ్యాపారం జరిగి సొమ్ములు చేతులు మారుతుండగా పలువురు అమాయికులు సర్వం ఒడ్డి నష్టపోతున్నారన్నారని పలువురు అంటున్నారు. కోడి పందాల కోసం సొమ్ములతో పాటు ఆస్తిపాస్తులు, భార్యల మెడలో పుస్తెలతాడు సైతం పణంగా పెడుతున్న వారు ఉన్నారు. ఈ కోడిపందాల్లో తరచూ ఘర్షణలు చోటుచేసుకుంటూ గ్రామాల్లో వర్గవిభేదాలు తలెత్తుతున్నాయి. గత ఏడాది గొల్లపాలెంలో ఘర్షణలు జరిగి పలువురు గాయాలపాలై కోర్టు వివాదాల వరకు వెళ్లారు. కోడి పందాలు జరగకుండా జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని బాధిత ప్రజలు, మహిళలు కోరుతున్నారు.

జూదరులకు హెచ్చరికలు

హైకోర్టు ఆదేశాల మేరకు గ్రామాల్లో ఎక్కడ కోడి పందాలు నిర్వహించినా కఠినచర్యలు తీసుకుంటామని పోలీసులు, రెవెన్యూ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు శనివారం మండల తహసీల్దార్ జీఆర్ ఠాగూర్, గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్, ఎంపీడీఓ జె.రాంబాబు తదితరులు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి కోడిపందాల నిర్వహణకు నిర్వాహకులు సిద్ధం చేసుకుంటున్న ఏర్పాట్లను ధ్వంసం చేశారు. ఇప్పటికే గొల్లపాలెం పోలీసులు గతంలో కోడిపందాలు నిర్వహించిన 72 మంది పాత నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేసి వారి నుంచి 30 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నారు.

ఆపస్ జిల్లా అధ్యక్షుడిగా 'వాడ్రేవు'



జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

రామచంద్రపురం: జిల్లా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) అధ్యక్షుడిగా వాడ్రేవు సుబ్రహ్మణ్య శ్రీనివాస్ శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని రిటైర్డు ఎంప్లాయీస్ భవనంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ప్రస్తుత అధ్యక్షుడు విష్ణు పదవీ విరమణతో ఏర్పడిన ఖాళీని జిల్లా కార్యవర్గం ఎన్నిక నిర్వహించగా శ్రీనివాస్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓలేటి వీవీ శాస్త్రి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. రానున్న కాలంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సంఘం పక్షాన కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రకటించారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజీ, జీవీ సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ సంక్రాంతి కానుకగా ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయుల ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నరేష్‌బాబు, కాకినాడ తూర్పుగోదావరి జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, పలువురు సంఘం సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు స్థలం కేటాయించాలి



ఎమ్మెల్యే వేగుళ్లకు వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికుల అసోసియేషన్ నేతలు

రాయవరం: తాము ప్రతి నెలా సమావేశాలు నిర్వహించుకునేందుకు రాయవరంలో పంచాయతీ స్థలాన్ని కేటాయించాలని భవన నిర్మాణ కార్మికులు కోరారు. ఈ మేరకు శనివారం మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును కలసి వినతిపత్రం అందజేశారు. రాయవరంలో తాపీ మేస్త్రిలు, ఎలక్ట్రీషియన్లు, పెయింటర్స్, టైల్స్ మేస్త్రిలు, కార్పెంటర్లు ఇలా భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. ప్రతి నెలా భవన నిర్మాణ కార్మికులు సమావేశాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ప్రతి నెలా 1వ తేదీన సమావేశాలు నిర్వహించుకునేందుకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల అసోసియేషన్ నేతలు కర్రి తాతారావు, బేర దుర్గాప్రసాద్, గండి చంద్రశేఖర్, లంక చందు, బండి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

రాయవరం: స్థానిక మాదిగపేటలో కమ్యూనిటీ హాలు స్థలంలో ఓపెన్ టాప్ షెడ్డుకు, ప్రస్తుతం ఉన్న కమ్యూనిటీ హాలు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మాదిగ సామాజిక వర్గ పెద్దలు మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాయవరంలో శనివారం పర్యటించిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. కమ్యూనిటీ హాలు భవనాన్ని పునర్వ్యవస్థీకరించి, వాటర్ లైనింగ్ పనులు చేయించాలని కోరారు. అలాగే కమ్యూనిటీ హాలు ముందు ఉన్న స్థలంలో ఓపెన్ టాప్ రేకు షెడ్డు వేయించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, మందపల్లి నాగేశ్వరరావు, చంద్రమళ్ల యాకోబు, లంక చందు, చంద్రమళ్ల చిన్నబ్బులు, మచ్చా సూర్యారావు, ఇందుగమిల్లి అరుణ్ తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కె.గంగవరం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధికారులు మాట్లాడుతూ ఈ ఏడాది ఎన్ఆర్‌జీఎస్, పంచాయతీరాజ్, ఎస్ఎస్ఏ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు సంబంధించిన 645 పనులకుగాను రూ.12.50 కోట్లను ఖర్చు చేశామని ప్రజావేదికలో తెలిపారు. ఈ పనులకు గత వారం రోజులుగా అయా గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించారని మండల స్థాయిలో నేడు ప్రజావేదిక నిర్వహిస్తున్నామని డ్వామా పీడీ మధుసూదన్ తెలిపారు. అనంతరం గ్రామాల వారీగా పనులపై తనిఖీ నిర్వహించి రూ.3500 రికవరీకి ఆదేశించారు. దీంతో పాటు మరో రూ.2000 ఫైన్ రూపంలో గుర్తించామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులన్నీ సక్రమంగా ఉండడం గుర్తించామని పేర్కొన్నారు. ఏపీడీ సత్యనారాయణ, ఏపీఓ గణపతి, ఎంపీడీఓ ఎన్.శ్రీనివాసరావు ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


గ్రామాభివృద్ధిలో దాతల పాత్ర కీలకం

రాయవరం: గ్రామాభివృద్ధిలో దాతల పాత్ర కీలకమని మండపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు పేర్కొన్నారు. రాయవరంలో శనివారం జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో కార్పొరేషన్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్)లో భాగంగా అనపర్తికి చెందిన ఇండియన్ టొబాకో కంపెనీ(ఐటీసీ), గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త తేతల సుబ్బరామారెడ్డి సహకారం రూ.10 లక్షలతో నిర్మించిన భోజనశాలను ఎమ్మెల్యే వేగుళ్ల ప్రారంభించారు. మహలక్ష్మమ్మ గుడి వీధి, పంచాయతీ కార్యాలయం వద్ద, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో రూ.60 లక్షల ఎన్ఆర్ఈజీఎస్, మండల పరిషత్, పంచాయతీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వుండవిల్లి రాంబాబు, సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు, ఎంపీడీవో కీర్తి స్పందన, ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, నీటి సంఘం ఉపాధ్యక్షుడు శాకా కోటేశ్వరరావు తదితతరులు పాల్గొన్నారు.

13న పూజఘటం ఊరేగింపు

రాయవరం: మండలంలోని పసలపూడిలో ఈ నెల 13న చింతాలమ్మ అమ్మవారి పూజఘటం ఊరేగింపు నిర్వహించనున్నట్టు అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఉదయం 8 గంటలకు సాయిబాబా ఆలయం వద్ద నుంచి అమ్మవారి పూజఘటం ఊరేగింపు ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారి పూజఘటాన్ని చింతాలమ్మ ఆలయంలో ఉంచుతామని తెలిపారు.

ఏరుపల్లిలో గోకులం షెడ్ ప్రారంభం



ఏరుపల్లిలో కేటిల్ షెడ్‌ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించిన మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఏరుపల్లిలో లబ్ధిదారుడు గుండుపల్లి వెంకటరమణ ఉపాధి హామీ నిధులు రూ.2.30 లక్షలతో నిర్మించుకున్న గోకులం షెడ్‌ను కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లిమొగ్గల శ్రీధర్, ఎంపీటీసీ సాక్షి శివకృష్ణకుమార్, మాజీ సర్పంచ్ చిల్లే గోపాలకృష్ణ, ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి, ఈఓపీఆర్డీ సెలత్‌రాజు, ఏపీఓ మోర్త ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెక్కలు తెగిన స్వప్నం నవల ఆవిష్కరణ



రెక్కలు తెగిన స్వప్నం నవలను ఆవిష్కరిస్తున్న హైమవతి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం కవి, పద్మభూషణ్ బోయి భీమన్న సతీమణి, ప్రముఖ రచయిత్రి బోయి హైమవతి, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో బోయి భీమన్న జీవన సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ కత్తిమండ ప్రతాప్ రాసిన రెక్కలు తెగిన స్వప్నం నవలను ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, ప్రతాప్ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చేస్తున్న సాహిత్య సేవలు ప్రశంసనీయమని అన్నారు. రెక్కలు తెగిన స్వప్నం నవల నేటి మధ్యతరగతి బతుకు చిత్రం అన్నారు. హైమవతిని ప్రతాప్ శాలువాతో సత్కరించారు. నల్ల విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కిరణ్ ప్రసాద్, గొల్ల లలిత, మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు క్రీడలు దోహదం



సంక్రాంతి ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై

కాజులూరు: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు చదువుతో పాటు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎం.మోహన్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కాజులూరు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న సంక్రాంతి ఆటల పోటీలను శనివారం ఎస్సై ప్రారంభించారు. సభలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకే తమ శాఖ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మండల గ్రామాలకు చెందిన పలువురు స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు

మండపేట: పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సినీజోస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని సంబరాలను ప్రారంభించారు. భోగి మంట వెలిగించి చిన్నారులతో సందడి చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులను సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చిట్టూరీ సతీష్, స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ షిబా, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా, యన్సీసా, విజయ, ఆర్‌సీఎం చర్చి పాస్టర్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన తుమ్మలపల్లి యక్షనాగశ్రీ ఆమె కుటుంబ సభ్యులు శనివారం రూ. 10116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.